# పండుటాకులు

సాయంత్రం నాలుగ్గంటలు . . . .

ఎప్పటికిమల్లే అతనికి అసహనంగా ఉంది. అక్కడ గడ్డ కట్టిన నిశ్శబ్దం బరువుగా- భరించరానిదిగా ఉంది. చెట్ల ఆకులు నిర్వేదం నింపుకుని కదలటం లేదు. పూల తలలు ఉల్లాసంగా వూగటం లేదు - విచారంలో మునిగినట్లున్నాయి. వూపిరాడకుండా ఉక్కుచట్రం లో బిగించిన ఫీలింగ్ . . . .

లేచి, మెల్లగా నడవటం ప్రారంభించాడు. దారికిరువైపులా పచ్చని చెట్లు - అయినా ఎందుకో ఆనందాన్నివ్వటం లేదు. మర్రి వూడల్లా మెదడు కుదుళ్ళలో పాతుకుపోయిన ఒంటరితనం - భయపెడుతూ, గుండెల్ని మెలిపెడుతూ . . . . భౌతికమైన ఒంటరితనం కాదిది. చుట్టూ పదిమంది ఉన్నా, మనసులో ముల్లులా అనవరతం గుచ్చుకుంటూ ఒంటరితనం . . . .

దూరంగా బాదంచెట్టు కన్పించగానే అతనికి ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. రోజూ అక్కడి సిమెంట్ బెంచీమీద కూచుని, ఆ బాదం చెట్టుని పరామర్శించనిదే అతనికి మనశ్శాంతిగా ఉండదు. ఆ చెట్టు తన నేస్తం. దాని ఆకులూ, కొమ్మలూ తనని ఆప్యాయంగా పల్కరిస్తాయి. తన రాకకోసం ఆ చెట్టు ఎదురు చూస్తూ ఉంటుంది.

అతను సింమెట్ బెంచీని సమీపించే వరకూ గమనించనేలేదు - అప్పటికే ఓ స్త్రీ అక్కడ కూర్చుని ఉండటం. తనదైన దాన్ని వేరెవరో ఆక్రమించుకున్నట్లు మనసు

విలవిల్లాడిందో క్షణం. వెంటనే స్ఫురణకు వచ్చింది ఆ బెంచీ అతని స్వంతం కాదని, దానిమీద కూచునే హక్కు ఎవరికైనా ఉందని.

కొన్నాళ్ళుగా దానిమీద కూచుంటున్నందుకే - ప్రాణం లేని ఆ బెంచీతో ఏదో తెలీని అనుబంధం ఏర్పడిందే తనకు - ఎంత పిచ్చి మనసు! అనుకున్నాడు.

వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలనుకున్నాడు. మనసొప్పలేదు. కొద్దిగా దగ్గరగా వెళ్ళి చిన్నగా దగ్గాడు. ఏదో ఆలోచనలో మునిగి ఉన్న ఆమె ఉలిక్కిపడి, తలతిప్పి చూసింది.

"మీకభ్యంతరం లేకపోతే ఇక్కడ కూచోవచ్చా" అన్నాడు.

ఆమె నిర్వికారంగా తలపంకించి, కొద్దిగా జరిగింది. అతను బెంచీ చివర్లో ఒదిగి కూచున్నాడు.

ఆమెను పరిశీలనగా చూశాడు. మనిషి తెల్లగా, పల్చగా ఉంది. మంచి పొడగరి. మొహంలో సంస్కారం ఉట్టిపడుతోంది. తెల్లటి వాయిల్ చీరమీద చిన్న చిన్న నీలంరంగు పూల డిజైన్.

"మీరీ ప్రాంతానికి కొత్తనుకుంటాను" అన్నాడు మాట కలుపుతూ . . . .

"ఔనండీ - మాది గుంటూరు. నిన్ననే వచ్చాను" అందామె. అతన్ని ప్రశ్నార్థకంగా చూస్తూ "మీరూ. . . . ." అంటూ ఆగింది.

"నాకూ ఈ సిమెంట్ బెంచీకి నాలుగేళ్ళ పరిచయం ఉంది. అదుగో . . . . ఆ బాదం చెట్టుంది చూశారూ . . . . రోజుకొక్కసారైనా ఇక్కడ కూచుని ఆ చెట్టుని చూడకపోతే నాకు తోచదు".

"అయ్యో! మీరు కూచునే స్థలంలో కూచున్నానా?" అందామె నొచ్చుకుంటూ.

"మన స్వంతం అనుకున్నవే మనవి కాకుండా పోయినప్పుడు, మనది కాని దానిమీద మనకేం అధికారం ఉంటుంది చెప్పండి" అన్నాడతను వేదాంతిలా.

"అవుననుకోండి. . . . అధికారం లేకున్నా అనుబంధం ఉండొచ్చుగా. గుండెని పదునైన కత్తిలా కోసేది అదే కదండీ. ఇంతకీ ఎంతమంది పిల్లలూ. . . ."

"ఇద్దరు మగపిల్లలు. రత్నాల్లాంటి పిల్లలంటే నమ్మండి. చదువుల్లో చాకుల్లాంటి కుఱ్రవాళ్ళు. నా కంటె బెత్తెడు ఎత్తుంటారు. వెరీ హ్యాండ్‌సమ్" అలా అంటున్నప్పుడు క్షణకాలం అతని కళ్ళు గర్వంగా మెరిశాయి.

"ఏం చేస్తున్నారేమిటి?"

"పెద్దవాడు కంప్యూటర్ ఇంజనీర్. అమెరికాలో ఉద్యోగం. నెలకు అయిదు వేల డాలర్లు జీతం. అంటే మన లెక్కలో రెండు లక్షలన్మాట. రెండోవాడు బెంగుళూర్‌లో లెక్చరర్" అతని మొహంలో ఎంతో తృప్తి.

"పిల్లల్ని ప్రయోజకుల్ని చేశారు. మీ జీవితం సార్థకమైంది" అందామె మనస్ఫూర్తిగా.

"నిజమే - వాళ్ళకోసం ఎంత కష్టపడ్డామనీ! నేనేమో బడిపంతుల్ని. నా పిల్లలు నాలా కాకూడదని - తినీ తినక చదివించాను. వాళ్ళడిగిన ప్రతి కోరికను కష్టమో, నష్టమో తీర్చాను. నాకు తోడుగా, పిల్లల ఉజ్వలమైన భవిష్యత్తే తన జీవితాశయంలా బ్రతికింది నా భార్య. పిల్లల అభివృద్ధిని కళ్ళారా చూసి, పదేళ్ళ క్రితం హాయిగా వెళ్ళిపోయింది - అదృష్టవంతురాలు. అవునూ . . . . ఈ వివరాలన్నీ అడుగుతున్నారు. మీగ్గానీ ఆడపిల్లలున్నారా ఏమిటి?" అతని పెదవుల మీద సన్నటి చిర్నవ్వు మెరిసింది.

"అంతదృష్టం లేదులెండి. నాకూ, మావారికీ ఆడపిల్లలంటే ఎంతిష్టమో - కాని కలగలేదు. ఒక్కడే కొడుకు. చాలనుకున్నాం. ప్రాణం అంతా వాడిమీదే పెట్టిపెంచాం. ఇపుడు వాడు బ్యాంక్ ఆఫీసర్" ఆమె తృప్తిగా నిట్టూర్చింది.

"చాలా సంతోషం - మన పిల్లలు పెద్ద హోదాల్లో ఉండటం కంటె మనక్కావల్సింది ఏముంది?"

"గత సంవత్సరం గుండెనొప్పితో పోయేక్షణం వరకూ మావారూ ఇదే అనేవారు. వాడి చదువు కోసం మా ఇల్లూ, ఆరెకరాల మాగాణి హరించుకుపోయినా కించిత్తుకూడా మేం బాధపడలేదు. మనకింకెవ్వరున్నారని - ఈ ఒక్క నలుసేగా అనుకున్నాం" ఆమెకు తన భర్త గుర్తొచ్చాడేమో కళ్ళు చెమర్చాయి.

"నేనూ అంతే కదండీ. ఉద్యోగంలో సంపాయించిన ప్రతిపైసా నా యిద్దరు కొడుకుల కోసమే ఖర్చు చేశాను. నాకంటూ గజంభూమి కానీ, బ్యాంకులో యాగాణీ డబ్బు కానీ మిగుల్చుకోలేక పోయాను. అయినా పర్లేదులెండి. నాకింకేం కావాలి. నా యిద్దరు కొడుకులూ దర్జాగా, సౌఖ్యాల్లో తులతూగుతున్నారు" అన్నాడు నవ్వటానికి ప్రయత్నిస్తూ. వద్దన్నా వినకుండా వెల్లువలా ఉబుకుతున్న విషాదం ఉందందులో. .

"మరీ . . . ." అంటూ ఏదో అడగబోయి ఆమె ఆగిపోయింది. ఆమె అడగాలనుకున్న ప్రశ్న ఏమిటో అతనికి తెలుసు - సమాధానమే తెలియదు. అదే ప్రశ్నను అతనడిగితే ఆమె దగ్గరా సమాధానం లేదు.

ఇద్దరూ మౌనంగా కూచున్నారు.

పండిన ఆకులు బాదం చెట్టుకి బరువుగా వేలాడుతున్నాయి. వాటి వల్ల ఏవిధమైన ఉపయోగమూ లేదని కామోసు బలవంతంగానైనా వదిలించుకోవాలని కొమ్మలు కసిగా కదులుతున్నాయి. ఎర్రగా పండిపోయిన ఆకులు . . . . చెట్టుతో ఉన్న అనుబంధాన్ని త్రెంచుకోలేక - దాని తిరస్కారాన్ని భరించలేక - రాలటానికి సిద్ధంగా ఉన్నాయి.

పండుటాకులు . . . . ప్చ్ . . . . ఎవ్వరికీ అక్కర లేదు.

పొద్దువాలిపోతోంది. ఎర్రటి నీరెండ బాదం ఆకుల మీద పడి, పరావర్తనం చెంది, వారి మొహాల మీద ప్రతిఫలిస్తోంది.

వారిమధ్య విషాదం చిక్కటి విషంలా . . . .

సమయం ఆరు గంటలైంది. భోజన సమయాన్ని సూచిస్తూ అక్కడి వృద్ధాశ్రమంలో గంట మోగింది.

అతను లేచి నిలబడ్డాడు. "నా పిల్లలకు నేను భారమైపోయాను. నన్నోపనికిరాని, విరిగిపోయిన వస్తువులా విసిరేశారు. అందుకే ఇలా. . . ." అని ఆమె చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.

"నా కోడలి మాటలు విని నా కొడుకు నన్ను తరిమేశాడు" అందామె గాద్గదిక స్వరంతో. ఆమె మాటలు ఆమెకే విన్పించనంత మంద్రంగా ఉన్నాయి.

ఇద్దరూ మౌనంగా ఒకర్ని ఒకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళల్లో సన్నటి నీటి పొర . . . .

వాళ్ళు ఆశ్రమం వైపు మెల్లగా నడవటం ప్రారంభించారు. వాళ్ళ కాళ్ళ క్రిందపడి ఎండుటాకులు నలుగుతున్న శబ్దం - విషాద సంగీతంలా విన్పిస్తోంది.

● *XII సౌత్ జోన్ కల్చరల్ మీట్ సావనీర్ - డిసెంబర్ 1998* ●